క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడికి నివాళి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: మండలంలోని మురారిపల్లె గ్రామానికి చెందిన ఆవుల అక్కిరెడ్డి బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల పార్టీ నాయకులు అక్కడికి వెళ్లి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ ఏకుల జయమ్మముసలారెడ్డి, హరిబాబు ఉన్నారు.

ఎస్టీల సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మార్కాపురం: మార్కాపురం డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్‌నాయక్ ఆదేశించారు. బుధవారం రాత్రి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరుకు చెందిన పలువురు ఎస్టీలు మాట్లాడుతూ.. తాము అడవిలో వెదురు బొంగులు తెచ్చుకుంటుంటే ఫారెస్టు అధికారులు ఇబ్బంది పెడుతున్నారని, దీంతో జీవనం సాగించలేక అవస్థలు పడుతున్నామని చెప్పారు. ఇంటి స్థలంతోపాటు పొలం, బ్యాంకు సబ్సిడీ రుణం ఇప్పిస్తే ఉపాధి మార్గాలు చూసుకుంటామని తెలిపారు. అర్హులైన ఎస్టీలకు ప్రభుత్వ పథకాలను అమలయ్యేలా చూడాలని అధికారులను శంకర్‌నాయక్ ఆదేశించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- కంభాలపాడు, ఆముదాలపల్లిలో నూతన భవనాలు ప్రారంభం



కంభాలపాడులో హెల్త్ సెంటర్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ, ఉడుముల

పొదిలి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పొదిలి మండలంలోని కంభాలపాడులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ సెంటర్, ఆముదాలపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ సెంటర్, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కేపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగనన్నతో సాధ్యమైందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో పాలన ప్రజలకు మరింత చేరువైందన్నారు. హామీలన్నీ నెరవేర్చి, అద్భుతమైన వ్యవస్థను తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. తొలుత ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు కె.నరసింహరావు, తల్లపురెడ్డి నారాయణరెడ్డి, పులిగొర్ల శ్రీనివాసులు, కోటిరెడ్డి, శిరిమల్లె శ్రీనివాసులు, గుర్రాల రమణయ్య ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, ఈఓఆర్డీ కృష్ణ, కమిషనర్ డానియల్ జోసఫ్, పీఆర్ ఏఈ మస్తాన్‌వలి, వైఎస్సార్ సీపీ నేతలు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్‌బేగం, యేటి ప్రసాద్, జూపల్లి ఏడుకొండలు, గూడూరి వినోద్, మండలపు శ్రీనివాసులురెడ్డి, కొత్తపులి బ్రహ్మారెడ్డి,కోదండరామిరెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు

సీఎం జగన్ పుట్టిన రోజుకు భారీ ఏర్పాట్లు

దర్శి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు పట్టణంలోని తమ నివాసంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు సీఎం పుట్టిన రోజు భారీ కేక్‌ను కట్ చేస్తారు. అనంతరం దర్శి, కురిచేడు, ముండ్లమూరు, దొనకొండ, తాళ్లూరు మండలాల పాస్టర్‌ల దంపతులకు దుస్తుల పంపిణీ చేస్తారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కురిచేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పుట్టిన రోజు వేడుకలను జయప్రదం చేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఉదయం కేక్ కటింగ్ ఉంటుందన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం కన్వీనర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సొసైటీ ప్రెసిడెంట్లు, పార్టీ నాయకులు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని నాగిరెడ్డి కోరారు

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక రాజీవ్ అతిథి గృహంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్నఓబులరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు కేక్ కటింగ్ ఉంటుందని, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మార్కాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మార్కాపురం పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో గురువారం ఉదయం 8.30 గంటలకు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్, జగనన్న అభిమానులు, ముఖ్యనాయకులు, పార్టీ కార్యకర్తలు, యువత కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పర్వతారోహణ క్యాంపునకు యర్రగొండపాలెం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, హెచ్‌ఎం

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు కేరళ పర్వతారోహణ క్యాంపునకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం కె.రమాదేవి బుధవారం తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కరణం జయసాయి చైతన్య, కోలా ఉమాశంకర్, వడితే అంజినాయక్‌లు క్యాంపునకు ఎంపికయ్యారని తెలిపారు. కేరళ పర్వతారోహణ క్యాంపుకు రాష్ట్రం నుంచి 21 మంది ఎన్‌సీసీ విద్యార్థులు ఎంపికకాగా వారిలో తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉండటం గర్వకారణమన్నారు. 17 అడుగుల ఎత్తులో ఉన్న స్థానిక కొప్పుకొండను కేవలం 12 నిమిషాల్లో అధిరోహించారని, అందుకు విద్యార్థులు అనునిత్యం కఠోర శిక్షణ పొందారని వివరించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ కాకర్ల సత్యనారాయణతో పాటు విద్యార్థులను ఎంఈవో పి.ఆంజనేయులు అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయుడు మద్దర్ల వెంకటభాస్కర్ విద్యార్థులకు ఖర్చుల కోసం రూ.వెయ్యి చొప్పున అందజేశారు.

తాగునీటి బోరు ఏర్పాటు

కంభం: మండలంలోని లింగోజీపల్లి బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన నూతన బోరును ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని బీసీ కాలనీలో తాగునీటి సమస్య ఏర్పడిందని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో బోరు ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఎంపీడీఓ ప్రసాద్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

తూనికలపై అవగాహన అవసరం

త్రిపురాంతకం: వినియోగదారులు, వ్యాపారులు తూనికలు, కొలతలపై అవగాహన కలిగి ఉండాలని ఆ శాఖ అధికారులు అబ్దుల్ రియాజ్, మొహిద్దీన్ తెలిపారు. త్రిపురాంతకం వాసవి ఆలయం వద్ద తూకాల మిషన్లను పరిశీలించి సీల్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే తూకాల మిషన్లు కొన్ని పరిశీలించి సీల్ వేశామని చెప్పారు. ఇంకా కొంతమంది కాటాలు పెండింగ్‌లో ఉన్నందున ఈ నెల 23 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, వెంటనే వ్యాపారులు కాటాలు పరిశీలించి సీల్ వేయించుకోవాలన్నారు. దర్శిలో తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశామని, మరికొంత మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. మార్కాపురం, దర్శి అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం ఫాదర్ ఫెర్రర్ ఆడిటోరియంలో బుధవారం మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఎంఈఓ మస్తాన్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని సర్పంచ్ చిత్తూరి హారిక ప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, గుమ్మా యల్లేష్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. సైన్స్, గణిత నమూనాలకు సంబంధించి 82 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయి. ఫిజిక్స్ లెక్చరర్ హుసేన్‌బాషా, బోటనీ లెక్చరర్ హనోక్‌బాబులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. రామచంద్రకోట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తేజ రూపొందించిన సేవ్ ఎర్త్ ప్రాజెక్టు, పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వి.నాగవంశి రూపొందించిన మాథమేటిక్స్ గేమ్స్ అర్హత సాధించాయి.

సైన్స్‌ఫేర్‌తో విద్యార్థులకు ఉపయోగం



సైన్స్‌ఫేర్ విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు

త్రిపురాంతకం: సైన్స్‌ఫేర్ ఎగ్జిబిషన్స్‌తో విద్యార్థులకు విజ్ఞానం అందుతుందని జిల్లా ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి సైన్స్‌ఫేర్ ఎగ్జిబిషన్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులను సైన్స్‌పై అవగాహన కల్పించి విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఎంపీడీఓ సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని విద్యాపరంగా అభివృద్ధి చెందాలన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను తయారు చేసి వారి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓలు కె.తులసి మల్లికార్జుననాయక్, టి.రాజశేఖరరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్టడిమెటీరియల్ పంపిణీ

గిద్దలూరు రూరల్: మండలంలోని పాదలకుంటపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి చదవుతున్న విద్యార్థులకు యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు పాఠశాలకు చెందిన హిందీ ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్య యాదవ్ తన సొంత ఖర్చులతో బుధవారం స్టడిమెటీరియల్స్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తన సొంత ఖర్చులతో పిచ్చయ్య యాదవ్ విద్యార్థులకు స్టడిమెటీరియల్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు శ్రద్ధతో విద్యను అభ్యసించి మంచి మార్కులు సాధించాలని కోరారు.

క్రీస్తు బోధనలు ఆచరిద్దాం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని డ్వాక్రా బజారులో డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్‌చేసి మాట్లాడారు. పలువురు పాస్టర్లు దైవసందేశం వినిపించి క్రిస్మస్ గీతాలను పాడారు. ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, ఏసీ సుధాకర్, ఏపీఎం రమేష్‌బాబు, సిబ్బంది నాగభూషణం, మనోకుమారి, స్వామి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అభయం ఆరోగ్యశ్రీ



పుల్లలచెరువు: ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, కన్వీనర్

పుల్లలచెరువు: ఆరోగ్యశ్రీ పథకం పేదల ఆరోగ్యానికి అభయం అని ఎంపీపీ కందుల వెంకటయ్య అన్నారు. పుల్లలచెరువు సచివాలయం-1 పరిధిలో కార్యదర్శి బాలునాయక్ అధ్యక్షతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యశ్రీని రూ.25 లక్షలకు పెంచారని గుర్తు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు బీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు అపర సంజీవిని లాంటిదన్నారు. మండలంలోని సచివాలయాల పరిధిలో వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి కార్డులు పంపిణీ చేయాలన్నారు. 500 ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. మండల ఉపాధ్యక్షుడు ఎల్.రాములు, పుల్లలచెరువు, నాయుడుపాలెం, మానేపల్లి సర్పంచ్‌లు ఓబులేసు, ఎ.కోటిరెడ్డి, రమణారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, ఎంపీడీవో మరియదాసు, ఈవోఆర్డీ శరత్‌బాబు, నాయకులు వెంకటేశ్వర్లు, సుందరరావు, ఎంఎల్‌ఓ వాసు పాల్గొన్నారు.

23న గీతాజయంతి, ముక్కోటి ఏకాదశి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీరామక్రిష్ణ ధ్యాన మందిరంలో ఈ నెల 23వ తేదీన గీతాజయంతి, ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు మందిరం నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ధ్యానమందిరంలో సుప్రభాతం, మంగళ హారతితో పాటు మధ్యాహ్నం 12 గంటలకు ప్రముఖ ఆధ్యాత్మిక వక్తలు మునుగొండ్ల వంశీకృష్ణ, పూనూరు హనుమంతారెడ్డిలతో ఉపన్యాస కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

కందిలో మెళకువలు పాటించాలి

గిద్దలూరు రూరల్: కంది పంటలో రైతులు మెళకువలు పాటించాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కంచిపల్లెలో పాలుగుళ్ల సూర్యరంగారెడ్డి తన పొలంలో పండించిన (స్కంద 111) కొత్తరకం కంది పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ రకం కంది పంట జిల్లాలోనే అరుదన్నారు. ఈ రకం పంట దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయని, రైతులు ఈ పంటపై ఆసక్తి చూపాలన్నారు. వెర్రి తెగులును తట్టుకుని ఎటువంటి చీడపీడలు ఆశించకుండా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, రైతులు ఉన్నారు.

అభయారణ్యంలో ప్లాస్టిక్ నిషేధం

గిద్దలూరు రూరల్: అటవీ శాఖ అభయారణ్యం ప్రాంతంలో ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు వంటి వస్తువులను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పూర్తిగా నిషేధించినట్లు గిద్దలూరు డిప్యూటీ డైరెక్టర్ వై.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై రూ.2 వేల జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు.

ఎరువు దుకాణాల ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కృష్ణా ట్రేడర్స్ ఎరువు దుకాణంలో బుధవారం స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సరుకు అమ్మకాలను నిలుపుదల చేశారు. బయోస్టిమ్యులెంట్స్ అమ్మే డీలర్లు తప్పకుండా జీ.3 పత్రాలు ఉండాలన్నారు. రైతులకు తప్పనిసరిగా వారు కొనుగోలు చేసిన వాటికి బిల్లులు అందజేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు విత్తనాలు విక్రయించడం చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణంలోని స్టాక్‌కు చెందిన రికార్డులు పరిశీలించారు. అయన వెంట ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని తూర్పుగంగవరంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వైవీ రమణయ్య తెలిపారు. గ్రామంలో ఇళ్ల మధ్యలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో బుధవారం ఆయన తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6900 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

100 మందికి దుప్పట్ల పంపిణీ

కంభం: దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు పోలూరి వెంకటస్వామి ఆధ్వర్యంలో మండలంలోని పాపాయిపల్లిలో 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను దివ్యాంగుడినైనా తనచుట్టూ ఉన్న వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు సాయం చేసేందుకు తన దివ్యాంగుల పెన్షన్ డబ్బు నుంచి కొంత డబ్బును సమకూర్చుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, జాకుల్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు

కంభం: బేస్తవారిపేట పరిధిలోని సహాయ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. సబ్జెక్టుల వారీగా నిపుణులైన బీవీ రామకృష్ణ, నారాయణ, రమణ, మధుసూదనరెడ్డి, రమేష్‌తో పాఠ్యాంశాలపై శిక్షణ ఇచ్చారు. పదోతరగతి విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించి మంచి మార్కులు సాధించాలన్నారు. పరీక్షలంటే భయపడకుండా ప్రణాళికబద్ధంగా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతో వ్యక్తిత్వ వికాసం



మాట్లాడుతున్న అంజిరెడ్డి

పొదిలి: గ్రంథ పఠనం వ్యక్తిత్వ వికాసానికి తోడ్పాటు ఇస్తుందని ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ×పుస్తకం చదవటం-కథలు చెప్పడం౯ కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 మంది పిల్లలతో సామూహిక పుస్తక పఠనం చేయించారు. పిల్లలతో వారి సొంత భాషలో కథలు చెప్పించారు. పాఠశాలకు పలు రకాల విలువైన పుస్తకాలను ఫౌండేషన్ తరఫున అంజిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు కరీమున్‌బీబీ, ఎన్‌వీఎస్.కుమార్, ఉపాధ్యాయులు బీవీ రెడ్డి, రంగనాయకులు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

కలువ పూలతో చెన్నకేశవ స్వామికి పూజలు

మార్కాపురం టౌన్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామివారిని రోజూ కలువ పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ గుంటూరు నుంచి స్వామివారికి కలువ పూలు తెప్పిస్తున్నారు. ఆలయ అర్చకులు శ్రీపతి కేశవాచార్యులు ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు చేస్తున్నారు. ఈఓ జి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తూ తీర్థప్రసాదాలు అందిస్తున్నారు. రోజూ స్వామివారికి సహస్ర నామార్చనలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు రోజూ ఆలయానికి వచ్చి పూజల్లో పాల్గొంటున్నారు.